

30లోగా ఆస్తి పన్ను చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 తొలి అర్ధ సంవత్సరపు ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థల పన్నులు తప్పనిసరిగా ఈ నెల 30లోగా చెల్లించాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు ఉన్న వారు ఆలస్యం చేస్తే వడ్డీ భారం తప్పదని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం ఈ నెల 21, 28 సెలవు రోజుల్లో పన్ను వసూళ్ల కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. సమయానికి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- యూరియా దొరక్క అవస్థలు పడుతున్న అన్నదాత
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- ఇళ్ల బిల్లులు రాక గృహనిర్మాణ లబ్ధిదారుల ఇబ్బందులు
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జెడ్‌పి నూతన సమావేశం మందిరంలో నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా సమస్య తీవ్రంగా ఉంది. బస్తా యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అధికారులు చెప్తున్నా రైతులకు మాత్రం యూరియా అందడం లేదు. షట్టర్ల అవినీతిపై సిఐడి కేసు ఉండటంతో కొత్తవి అమర్చకపోవడంతో పాడైన వాటితోనే నెట్టుకువస్తున్నారు. గతంలో టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్ల బిల్లులు చెల్లింపుల కోసం సర్వే చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తున్నా డబ్బులు రాక వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు విద్యుత్, ఆర్అండ్‌బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించి ఏం పరిష్కారం చూపుతారన్నది అంతా ఎదురుచూస్తున్నారు.



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి
జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. 2025-ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 24,421 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాకు కేటాయించిన పరిమాణంలో కంటే అదనంగా నాలుగు వేల మెట్రిక్ టన్నులకు పైగా అందించామని చెప్తున్నా అవేవీ రైతులకు అందలేదు. ప్రభుత్వ పంపిణీ కేంద్రాలకు యూరియా వచ్చే నాటికి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులెవరూ వాటి కొనుగోలుపై దృష్టి సారించలేదు. గత నెల మూడో వారం నుంచి వరుస అల్పపీడనాలతో వర్షాలు కురుస్తుండటంతో రైతులకు యూరియా అవసరమేర్పడింది. అప్పటికే యూరియా గ్రామాలో పలుకుబడి ఉన్న నేతలు, వారి బంధువుల ఇళ్లకు చేరిపోయింది. దీంతో యూరియా కోసం కేంద్రాలకు వెళ్లిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వ పంపిణీ కేంద్రాల్లో యూరియా నిల్వలు నిండుకోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాల ముందు క్యూ కడుతున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత పంపిణీ కేంద్రాలకు వచ్చిన ఎరువులను ఆర్ఎస్‌కె సిబ్బంది ఎటువంటి వేలి ముద్రలు వేయకుండానే పంపిణీ చేశారు. దీంతో సిఫార్సులు, గ్రామాల్లో పలుకుబడి ఉన్న నాయకులు చెప్పినట్టుగానే సిబ్బంది ఎరువులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో సామాన్య రైతులకు ఒక్క బస్తా యూరియా అందడం కూడా గగనమైపోయింది.

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండటంతో నిర్దేశించిన పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందని పరిస్థితి తలెత్తింది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండటం, కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకు పోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెకులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో 1800 క్యూసెకులకు మించి నీరు విడిచి పెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెకులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. వంశధార రెండు కాలువల్లోనూ విపరీతంగా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సాగునీరందించాలంటూ పలాస ప్రాంత రైతులు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. దాదాపు 15 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గొడౌన్లలో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడయిపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 37,215 ఇళ్లకు రూ.50.33 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసి ఆరు నెలలు కావొస్తున్నా ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అచ్చెన్న... వచ్చేనా?

ఈ ఏడాది జూన్ 28న నిర్వహించిన జెడ్‌పి సర్వసభ్య సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గైర్హాజరు కావడంపై అనేక విమర్శలు వచ్చాయి. జిల్లాలోనే ఉండి రాకపోవడంపై తీవ్ర చర్చ సాగింది. నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో పలు ప్రభుత్వశాఖలపై సమీక్షించిన ఆయన సర్వసభ్య సమవేశానికి మాత్రం డుమ్మా కొట్టారు. సమీక్షలు తర్వాత కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి ఉద్దానం తాగునీటి పథకం ఫేజ్-2 ప్రారంభానికి పాతపట్నం వెళ్లారు. ప్రజలెన్నుకున్న పాలకవర్గాన్ని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా అవమానించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వారితో పాటు పాల్గొనడంతో ఆయన కూడా హాజరు కాలేదు. కావడంతో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పే వారే కరువయ్యారు. ఈ సారి సమావేశానికి వస్తారా? లేదా? డుమ్మా కొడతారా? అనేది వేచిచూడాల్సి ఉంది.



చికిత్స పొందుతున్న విద్యార్థిని చందన

ప్రమాదమా... ఆత్మహత్యాయత్నమా?

- మూడంతస్తుల పైనుంచి కిందపడిన ఇంటర్ విద్యార్థిని
- అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలింపు
- అర్థరాత్రి కెజిబివిలో చోటుచేసుకున్న సంఘటన

ప్రజాశక్తి- పొందూరు
అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో మూడంతస్థుల భవనం నుంచి ఇంటర్ విద్యార్థిని వందన కిందపడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన పొందూరు మండలంలోని లోలుగు కెజిబివిలో చోటుచేసుకుంది. పాఠశాలకు సమీపంలోని కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆవరణంలోని మూడంతస్తు నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పటివరకూ చదువు కుంటూ మెలుకవలో ఉన్న విద్యార్థులకు ఒక్కసారిగా శబ్దం రావడం పరిగెత్తుకు వెళ్లారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని చూసి రాత్రి విధుల్లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయురాలు రూపవతి, అకౌంటెంట్ నాంచారమ్మలు వెంటనే ప్రిన్సిపాల్ ఎస్. లలితకుమారికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆంబులెన్స్‌తో చికిత్స కోసం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు వెన్నుపూస కూడా గాయమైనట్లు సమాచారం. ఈ సంఘటనతో విద్యార్థినిలు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు.

అర్ధరాత్రి బాత్‌రూంకు వెళ్లి ఉక్కబోతతో గాలికోసం పైకి వెళ్లానని, అక్కడ గోడపై కూర్చొనే క్రమంలో జారిపడినట్లుగా విద్యార్థిని చెబుతుందని ప్రిన్సిపాల్ లలితకుమారి చెబుతున్నారు. అర్ధరాత్రి సమయంలో విద్యార్థిని ఒక్కరే పై అంతస్తుకు వెళ్లడంమేమిటని, ఆమె పైనుంచి జారిపడిందా? లేక కావాలనే దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందా? అంటూ పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని బాగా చదువుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల చదువుపై సక్రమంగా శ్రద్ధ కనబరచకపోవడంతో పాటు ఆమె వ్యక్తిగత విషయాలపై కూడా సున్నితంగా మందలించి బాగా చదువుకోవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు చెప్పినట్లుగా పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఇటీవల గత కొన్ని రోజులుగా అనేక విషయాలపై కెజిబివిలో వరసగా వివాదాలు చోటుచేసుకుంటుండడంతో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ వి.సత్యనారాయణ పాఠశాలలో చోటుచేసుకున్న ఈ సంఘటనపై ఉపాధ్యాయులతో, విద్యార్థినులతో విచారణ చేపట్టారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫోన్‌లో సమాచారం అందజేశారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల పరామర్శ

శ్రీకాకుళం సిటీ: లోలుగు కెజిబివి విద్యార్థిని చిత్తారపు వందన శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఈ విద్యార్థినిని ఎఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పవిత్ర, జిల్లా కమిటీ సభ్యులు ఖగేష్‌లు పరామర్శించారు. సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థినికి పూర్తిస్థాయి వైద్యం అందించాలని అన్నారు. భవిష్యత్‌లో ఇటు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



చెత్తను తొలగిస్తున్న కలెక్టర్, జెసి

స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్
భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రపరచు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పెద్దగనగళ్లవానిపేటలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలసి ఆయన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 193 కిలో మీటర్ల సువిశాలమైన తీరప్రాంతం ఉందన్నారు. బీచ్ శుభ్రపరచు ప్రాంతంగా పెద్దగనగళ్లవానిపేట బీచ్‌ను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసినట్లు చెప్పారు. బీచ్‌లో ఉన్న చెత్తను ఏరివేసి డస్ట్ బిన్‌లో వేశారు. బీచ్‌లను సందర్శించే పర్యాటకులు బీచ్‌లను శుభ్రంగా ఉంచాలన్నారు. బీచ్‌లోకి ఎవరైనా వస్తే ఉపయోగించే చెత్తను డస్ట్ బిన్‌లో, మీతోనే తీసుకువెళ్లాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కింద జిల్లాలో ఇప్పటికే 912 గ్రామాల్లో 221 గ్రామాల వరకు ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా చేశామన్నారు. శనివారమూ 31 గ్రామాలను ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా డిక్లేర్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో పూర్తిగా పరిశుభ్రతపై అవగాహన, సోలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కింద ఇంకుడు గుంతలు, కంపోస్టింగ్ ఫెసిలిటీస్ ఉంటే ఆ గ్రామాన్ని మోడల్ గ్రామంగా ప్రకటించవచ్చన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ యూజ్డ్ ప్లాస్టిక్‌గా డిక్లేర్ చేస్తామన్నారు. ఒకేసారి వాడిన ప్లాస్టిక్ అంటే స్ట్రాస్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్‌ను మున్సిపాలిటీలో వాడకూడదని ప్రకటిస్తామన్నారు. అలాగే బోర్డులపై సంతకాలు చేశారు. స్వచ్ఛతా హీ సేవ, ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు, తదితర నినాదాలతో పేపర్లు ప్రదర్శించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ కరుణశ్రీ, డిపిఒ కె.భారతీసౌజన్య, తహశీల్దార్ గణపతిరావు, ఎంపిడిఒ ప్రకాశరావు, జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.రాజశేఖర్, విశ్రాంత జాయింట్ ఛీఫ్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ కె.రమేష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ సిహెచ్.హరీష్, సర్పంచ్ బర్రి రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగాల భ్రమలు.. మోసపూరిత మాటలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి
పాలకులు తమ ప్రయోజనాల కోసం తీసుకొచ్చే కాలుష్య కారక ప్రాజెక్టులు, పోర్టుల కోసం ప్రజలను ఒప్పించేందుకు రకరకాల విన్యాసాలు చేస్తుంటారు. ప్రాజెక్టు వస్తే యువతకు ఉద్యోగాలు వస్తాయని భ్రమలు కల్పిస్తుంటారు. ప్రాజెక్టులతో ఆ ప్రాంతం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిపోతుందని అరచేతిలో వైకుంఠం చూపిస్తుంటారు. బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రస్తుతం వివిధ రకాల వేదికలపై అవే మాటలు చెప్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. థర్మల్ పవర్ ప్లాంట్లతో ఏం ఉద్యోగాలు వస్తాయో, వాటి ఏర్పాటుతో ఏం అభివృద్ధి చెందిపోతుందో సోంపేట, కాకరాపల్లి పవర్ ప్లాంట్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు తేటతెల్లం చేస్తున్నాయి. చిత్తడి నేలలు, పర్యవరణాన్ని నాశనం చేసే థర్మల్ ప్లాంట్ వద్దంటూ ప్రజలు పెద్ద ఉద్యమమే సాగించారు. ప్రజలపై బలవంతంగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రజలపై రుద్దడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. ప్లాంట్ వద్దని అన్నందుకు కాల్పులు జరిపి అమాయకులైన ముగ్గురి ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. పట్టువీడకుండా ప్రజలు సాగించిన ఆందోళనలకు దిగొచ్చిన ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలోనూ అదే తరహాలో పోరాటం సాగింది. ఇక్కడ కూడా ప్రభుత్వం కాల్పులకు తెగబడి ఒకరిని బలితీసుకుంది. సోంపేట పవర్ ప్లాంట్ ఘటన విషయంలో నాడు రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు ప్లాంట్ ఏర్పాటుకు ఎవరైనా అడ్డు పడితే రోడ్డు రోలర్‌తో తొక్కించేస్తానంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే కూన రవికుమార్ అదే పాత్ర పోషిస్తున్నారు. థర్మల్ ప్లాంట్‌కు ఎవరు అడ్డం వస్తారో చూస్తానంటూ పరుష వ్యాఖ్యలు చేస్తున్నారు. కాకరపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయంటూ, ఆ ప్రాంతం అభివృద్ధి చెందిపోతుందంటూ నాడు ఎమ్మెల్యేగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు నమ్మబలికారు. ఆయనపై నమ్మకంతో పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం రైతులు తమ పచ్చని పంట భూములను ఇచ్చారు. తర్వాత ప్లాంట్ దివాలా తీయడంతో ఉత్పతి లేదు, ఉద్యోగాలు లేవు. పైగా 2 వేల ఎకరాల్లో నిర్మించిన ప్లాంట్‌ను ఓ ప్రైవేట్ కంపెనీకి ప్రభుత్వం కారు చౌకగా కట్టబెట్టేసింది. బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ వస్తే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగాలు వస్తాయంటూ ఇటీవల బూర్జ మండల సమావేశంలో చెప్తూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో సోంపేట, కాకరాపల్లి అనుభవాలు తర్వాత కూడా అభివృద్ధి జరిగిపోతుందని, ఉద్యోగాలు వస్తాయంటే ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరు. థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ఎంతటి వినాశకరమో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం స్వయంభూవరం ప్రాంతంలో రెండు వేల మెగా వాట్ల సామర్థ్యంతో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్లాంట్‌తో గ్రామస్తులు పడుతున్న ప్రత్యక్షనరకమే ఒక ఉదాహరణ. తీవ్ర కాలుష్యం, జబ్బులు, తాగడానికి పనికిరాని నీళ్ల వంటి సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటిని విస్మరించి ఉద్యోగాలు, అభివృద్ధి పేరుతో ప్రజల్లో భ్రమలు కల్పించడం వారిని మోసగించడమే అవుతుంది.

ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు నిజంగా మేలు చేయదలుచుకుంటే సుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ కనీస ప్రయత్నమైనా చేసి ఉండేవారన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపించాలంటూ ఆ ప్రాంత రైతులు చాలా కాలంగా పోరాడుతూనే ఉన్నారు. పరిశ్రమను తెరిపించగలిగితే ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కలుగుతుందని రైతు సంఘాల నాయకులు అనేక సార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. దీంతో పాటు ఆ ప్రాంతంలో మార్కెంటింగ్, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు లేకపోలేదు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు కీడు చేయని సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే పని చేయకుండా ప్రజలకు, పర్యావరణానికి నష్టం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ ప్రజలపై రుద్దటంపై ఎవరి ప్రయోజనాల కోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. 2014-19 టిడిపి హయాంలో జైనా నిధులతో చేపట్టిన నారాయణపురం ఆనకట్ట ఏడేళ్లు అవుతున్నా... ఇప్పటికీ పూర్తి కాలేదు. బూర్జ మండలం బొమ్మిక వద్ద నిర్మించిన రిజర్వాయరు తిత్లీ తుపానులో దెబ్బతినడంతో లీకై నీరు కిందికి వెళ్లిపోతున్నా బాగుచేసే దిక్కే లేకుండా పోయింది. వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు టిడిపి హయాంలో 2017లో పనులు మొదలైనా ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రాజెక్టు పనులు ఆగిపోవడానికి కారణమైన బడ్జెట్‌లో నిధులు కేటాయింపు, కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లింపు, భూ సేకరణ నిధులు వంటి సమస్యల పరిష్కారంపై కనీసం చొరవ చూపని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇప్పుడు దృష్టంతా థర్మల్ ప్లాంట్‌పైనే కేంద్రీకరించారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నా వాటిని వదిలేసి పవర్ ప్లాంట్‌ను కొత్తగా తెరపైకి ఎందుకు తీసుకొచ్చారన్న సందేహాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో ఏమైనా హామీ ఇచ్చారా? అంటే అదీ లేదు. ఏం ప్రయోజనాలు ఆశించి తీసుకొచ్చారోనని అంతా అనుకుంటున్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న వాబ యోగి తదితరులు

పవర్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అడ్డూరిపేటలో శనివారం ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో 3200 మెగావాట్స్ సామర్థ్యంతో తీసుకొస్తున్న థర్మల్ పవర్‌ప్లాంట్ వలన తీవ్రమైన పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ఈ జెండా పట్టుకొని పవర్ ప్లాంట్ తరిమికొట్టే వరకు ఆదివాసీలు, రైతులు, మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు. పచ్చని పంట పొలాలు పత్రహరితంతో కూడిన పచ్చరంగు జెండాలు, వ్యవసాయం చేస్తున్న చిహ్నం, పచ్చదనానికి రైతాంగానికి వ్యవసాయానికి గుర్తుగా ఈ జెండాను ముద్రించినట్లు తెలిపారు. పవర్ ప్లాంట్ వ్యతిరేకించిన 24 ఆదివాసి గ్రామాలు, 20 మైదాన గ్రామాలు ఈ జెండా పట్టుకొని పవర్ ప్లాంట్‌ను తిప్పికొట్టేంతవరకు పనిచేయాలన్నారు. 22న జరిగే పవర్‌ప్లాంట్ వ్యతిరేక బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ జండా ఆవిష్కరణలో పోరాట కమిటీ కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి రవికాంత్, లక్ష్మణ్, అరిక ప్రసాద్, సవర. కురమయ్య, సవర నగేష్, సవర చుక్కయ్య, సవర.కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం సిటీ : నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖర్లు

2.0 వ్యవస్థను రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకు వచ్చిన 2.0 వ్యవస్థను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ శనివారం రెండోరోజు పెన్‌డౌన్ చేశారు. స్థానిక రిజిస్టర్ కార్యాలయంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేసి నిరసన తెలియజేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ పాత రిజిస్ట్రేషన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒక రిజిస్ట్రేషన్ కోసం ఈ 2.0 విధానం వల్ల గంటల సమయం పడుతుందని, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు కాకుంటే సాధ్య పడటం లేదన్నారు. ఆధార్ అప్‌డేట్ తరువాత రిజిస్ట్రేషన్ చేయవల్సి వస్తుందన్నారు. ఈ వృత్తిని నమ్ముకొని బతుకుతున్న దస్తావేజు లేఖర్లు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రైమ్ కార్డు విధానంలో మార్పులు చేయాలన్నారు. ఒటిపి విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను సైతం పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాజారావు, రామకృష్ణ, భువన్ మోహన్, తాళ్లవలస కుమార స్వామి, చింతనిప్పుల అప్పలరాజు, అన్నెపు సీతారం, అల్లు రాజారావు, బలగ రామకృష్ణ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ మున్సిపాలిటీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు డొంక జయరాం, బి.రవికుమార్, ఆర్.శ్యాం, పి.అప్పలస్వామి, ధనుంజయ, లావేటి గోవిందరావు, శిష్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న తులసీదాస్‌రెడ్డి

'స్వర్ణభారతి'లో రెడ్ డే

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం రెడ్ డే దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల మేధాశక్తి, సృజనాత్మర శక్తి పెరగాలంటే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ముఖ్యమన్నరు. ఈ సందర్భంగా చిన్నారులు ఎరుపు రంగుతో ఉన్న దుస్తులు దరించారు. దీంతో పాటు పలు రకాల పండ్లు, పువ్వులు, బెలూన్లు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణభారతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.వి.శ్రీనివాసరావు, విజయిలక్ష్మి, గుణవతి పాల్గొన్నారు. అనంతరం విద్యా సంస్థలో ముందుస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు.


ఫ్యాన్లను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థానిక లయన్స్ క్లబ్ సుమారు రూ.25 వేలు విలువ చేసే 10 ఫ్యాన్లును విరణగా అందజేశారు. పాఠశాలలోని పలు తరగతి గుదుల్లో విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు లయన్స్‌క్లబ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఫ్యాన్లును హెచ్ఎం యం.వాగ్దేవికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు యర్రా మల్లిబాబు, యర్రా సతీష్, పి.దివాకర్, వి.సూర్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

మార్పుతోనే పారిశుద్ధ్యం సాధ్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పరిశుభ్రత కార్యక్రమాలు ఒకరోజు చేస్తే సరిపోవు, ప్రజల వ్యవహార శైలి, ప్రవర్తనలో మార్పు వచ్చినప్పుడే ఫలితం కనిపిస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వం వైద్య కళాశాల విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ బయోమెడికల్ వ్యర్థాలు అత్యంత ప్రమాదకరమైనవని, వాటిని వేర్వేరుగా విభజించి నిర్వీర్యం అలవాటు కావాలన్నారు. ఆస్పత్రిలో చదువుతున్న మీరంతా మరింత బాధ్యతతో ఉండాలన్నారు. జిజిహెచ్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి ఆరు నెలలు దానిని సంరక్షించాలని సూచించారు. క్యాంపస్‌లో వీధికుక్కల బెడద ఉందని, మహిళా విద్యార్థుల హాస్టల్‌లో లెగ్ ఆపరేటెడ్ డస్ట్‌బిన్స్ సరిపడా ఏర్పాటు చేయాలని, లోపల ఇంటర్నెట్ రావడం లేదని విద్యార్థులు తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మెడికల్ కాలేజ్ ఆవరణలో కలియ తిరుగుతూ డ్రైనేజీ, శానిటేషన్ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు చూపించిన సమస్యలను స్వయంగా గమనించి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలికల వసతి గృహంలో వారితో కలిసి భోజనం చేశారు. క్యాంపస్ పరిశుభ్రతను కాపాడు కోవడంలో విద్యార్థులు, సిబ్బంది ముందడుగు వేస్తేనే ఈ కార్యక్రమం విజయ వంతమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్‌పి మహేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఆర్ఎంఒ డాక్టర్ సుభాషిని, జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలో నగర పాలక సంస్థ కమిషనర్ బివిడి ప్రసాదరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. డిసిసిబి కాలనీలో స్థానిక ప్రజలతో కలిసి కలుపు మొక్కలను తొలగించి, మొక్కలు నాటారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని అన్ని కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేయడంతో పాటు దోమల


శ్రీకాకుళం సిటీ : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నివారణకు క్రిమిసంహారక మందులు చల్లారు.

బూర్జ: చిన్నారుల ఆరోగ్యంపై అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఛీఫ్ ప్లానింగ్ అధికారి వివిఎస్ఎస్ఎల్ ప్రసన్న సూచించారు. కొల్లివలస అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. తాగేనీటి బోరు వద్ద అపారిశుధ్యం నెలకొందన్నారు. ఎప్పటికప్పుడు కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి సూచనలు చేశారు. ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఉప గణాంకాల అధికారి అప్పా రావు, ఎఎస్ఒ అచ్యుత్ కుమార్, వీఆర్ఒ రమాబాయి. సిబ్బంది ఉన్నారు.

ఆమదాలవలస: మండలంలోని తొగరాం సచివాలయం, ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. మండలంలోని కొర్లకోటలో పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి అన్నెపు గోపాలరావు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల నాయుడు, వైద్యాధికారి మెట్ట స్రవంతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో ప్లాస్టిక్ సంచులు ఏరివేసి మొక్కలను నాటారు. అనంతరం కళాశాల విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, కమిషనర్ తమ్మినేని రవి, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, సంపదరావు మురళి, పివివికె రాజు, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, రవిబాబు, జల్లేపల్లి రామారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ సాహిని వాసుదేవరావు ఆధ్వర్యంలో లో స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పాటించా లంటూ ర్యాలీ చేపట్టారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు అల్లు సోమేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఆర్.రఘునాథ్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, సర్పంచ్ శ్రీలక్ష్మి ఎంపిటిసి వాణి, డిప్యూటీ ఎంపిడిఒ సింహాచలం, ఎపిఒ శ్రీనివాసరావు, ఇఒ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల ఆవరణలో స్వర్ణాంధ్రలో భాగంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి. రవికుమార్, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షుడు భైరి భాస్కరరావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

జలుమూరు : మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆర్‌డిఒ ప్రత్యూష స్వచ్ఛాంధ్రలో భాగంగా మొక్కలను నాటారు. అలాగే కొండపోలవలస ఎంపిపి స్కూల్, అంగన్వాడీ కేంద్రాల ఆవరణల్లో కూడా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చిన్నమ్మడు, తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు.

పలాస : స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన మేనేజర్ ఎం.ఎన్. ఎన్.నాయుడు కరంచ, బాదం, చెర్రీ, మామిడి మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోగెల గోపాల్, గ్రీన్ ఆర్మీ సభ్యులు మల్ల మెటిలాల్, మెకానిక్ ఫోర్‌మెన్ హేమంత్, హెడ్‌గార్డు రామ్మోహనరావు, యూనియన్ నాయకులు ఎ.వి.రావు, జె.కె.రావు, డి.ఎస్. రావు, వర హాలమ్మ, దండాసి తేజేశ్వరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కవిటి: స్వర్ణాంధ్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, జె.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాదినాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, డి.జనార్ధనరావు, బి.అంజన పాల్గొన్నారు.

అలాగే కొత్తపేట సముద్రతీరంలో సందడి వాతావరణం నెలకొంది. మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యాన స్వచ్ఛ సాగర్ – సురచ్ఛ సాగర్ కార్యక్రమం గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సాక్షిగా ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, సముద్ర సంపద రక్షణ అనే నినాదాలతో చేపట్టిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. మొత్తం 98 మంది హాజరై తీరప్రాంతాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం ఎంపిడిఒ త్రినాథ మాట్లాడుతూ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, ఎపిఒ టి.మోహనరావు, మత్స్యకారపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

మందస: స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రభుత్వాస్పత్రి నుంచి పాత తహశీల్దార్ కార్యాలయం వరకు జంగిల్ క్లియరెన్స్ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంతోష్‌కుమార్ పండా, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: పరిసరాలు పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చాపరలో స్వచ్ఛాంధ్రలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, ఎపిఎం రవికుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో ఎంపిడిఒ కె.రామారావు, ప్రధాన వైద్యాధికారి దేవేంద్రరావులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్లు బి.గౌతమి, శిల్ప, ఎన్.నీలిమ, మున్సిపల్ కమిషనర్ రమేష్, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్ వెంకటేష్, కాదా రామకోటి పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పిఒ రజనీకుమారి, ప్రిన్సిపాల్ నవ్యశ్రీమహంతి, సుధాకర్‌లు ఆధ్వర్యాన మొక్కలు నాటారు.

మున్సిపాలిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని కమిషనర్ ఎన్.రమేష్ ప్రకటించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలన్నారు.

సోంపేట : మండలంలోని గొనపపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారి భవానీశంకర్, ఎఒ బి.నరసింహమూర్తి మొక్కలను నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జగ్గుతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, హెచ్ఎం టి.తామాడ కృష్ణారావు, కార్యదర్శి ఎ.వరలక్ష్మి పాల్గొన్నారు.

పలాస : స్వచ్ఛాంధ్రలో భాగంగా కమిషనర్ ఎం.రామారావు నెహ్రూ పార్కు వద్ద మొక్కలు నాటారు. సంత మైదానంలో పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

రణస్థలం: మండలంలోని బంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్రలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ రజిని, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, లంక శ్యామ్, డిజిఎం ఆనందరావు, పిన్నింటి భానోజీ నాయుడు, పిషిని జగన్నాథం నాయుడు, రౌతు శ్రీనివాస్, కలిశెట్టి రామారావు, కలిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

తరగతి గదిలో దిగువ శ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ సూచించారు. శనివారం రెండో పూట మండలంలోని ఆరు పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ నిర్వహించారు. అందులో భాగంగా ఎంఈఒలు మాట్లాడుతూ టూల్ 1, టూల్ 3 విద్యార్థులతో చేయించాలని చెప్పారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థుల పూర్తిస్థాయిలో బోధన కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎమ్ తనూజ, డిఆర్‌పి జానకిరావు, జగన్, సిఆర్‌పి తులసి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛాయరాజ్ వర్ధంతి

జలుమూరు: ఉపాధ్యాయునిగా, ప్రజాకవిగా, సాహిత్యలోకానికి ఒక సరికొత్త మార్గాన్ని చూపి, జనసాహితి రాష్ట్ర అధ్యక్షునిగా సేవలందించిన కొంక్యాన ఛాయరాజ్ 13వ వర్ధంతి సభను శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్టు జనసాహితి అధ్యక్షులు కె.భానుమూర్తి, కార్యదర్శి పి.మోహనరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా కవి, పత్రికా రచయిత సయ్యద్ సాబీర్ హుస్సేన్, వక్తగా విశ్రాంత అధ్యాపకులు కవి రచయిత డాక్టర్ సనపల నారాయణమూర్తి పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ అభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కవులు, రచయితలు, కళాకారులు ప్రజాస్వామ్యవాదులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

కొత్తమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కోటబొమ్మాళి మండల కేంద్రంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న కొత్తమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరకు భద్రతా పరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సిసి కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. యాత్రికుల రాకపోకలకు ఆటంకం లేకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించనున్నామని చెప్పారు. ఈ జాతరను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, ఉత్తరాంధ్రతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి యాత్రికులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. యాత్రికులకు ఎలాంటి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో రంగులు, బారికేడ్లు, గేట్లు, విద్యుద్ధీకరణ, మౌలిక సదుపాయాలు, అన్నదానం, పగటివేషాలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, నాణ్యమైన ప్రసాదం, ప్రత్యేక దర్శన టిక్కెట్లు రూ.20 టికెట్లపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. జాతర సందర్భంగా కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు రహదారి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, సెంటర్ డివైడర్ అలంకరణ, విద్యుద్దీపాలు అమర్చినట్లు తెలిపారు. ఆర్‌టిసి బస్సులు, వైద్య శిబిరాలు, అన్నదానం, మజ్జిగ పంపిణీ, శోభాయాత్ర వంటి ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రాజీయే సరైన మార్గం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజీయే సరైన మార్గమని మధ్యవర్తిత్వ న్యాయవాది కణితి విజయలక్ష్మి భాయ్ అన్నారు. శనివారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో కక్షిదారుల మధ్య ఉన్న కేసుల మధ్యవర్తిత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్న వివాదాలకు రాజీయే శాశ్వత మార్గమన్నారు. దీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. ముందుగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ట్రైనీ మీడియేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి భాయ్‌ను న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని అన్నం నాయుడు, వాడవలస రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి దిగిన బాలుడు

పలాస: రైల్వే స్టేషన్‌లో తల్లిదండ్రులు లేకుండా తిరుగుతున్న బాలుడిని అధికారులు గుర్తించి శిశు గృహానికి తరలించారు. శనివారం ఉదయం ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ నుంచి పలాస స్టేషన్‌లో మూడేళ్ల బాలుడు ఒంటరిగా దిగాడు. ఈ విషయాన్ని ప్రయాణికులు 139 నంబరు ద్వారా సమాచారం ఇచ్చారు. అక్కడే ఉన్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది బాలుడిని చైల్డ్ హెల్ప్‌లైన్‌కి అప్పగించారు. తల్లిదండ్రుల గురించి విచారించినా ఎవరూ ముందుకు రాలేదు. ఆ బాలుడు ఏం చెప్పలేకపోవడంతో వివరాలు అందుబాటులోకి రాలేదు. అనంతరం బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఆ చిన్నారిని శ్రీకాకుళంలోని అరసవల్లి శిశుగృహంలో చేర్పించారు. బాలుడికి సంబంధించి తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖను సంప్రదించాలని అధికారులు కోరారు.

చిన్నాచారి మృతికి సంతాపం

పలాస : మండలంలోని లొద్దభద్రకు చెందిన కొత్తపల్లి చిన్నాచారి మృతిపై జన జాగృతి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ శనివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కళా రంగంలో లలిత కళారంజని, జన జాగృతి, సంస్థల్లో కీలక భూమిక పోషించి, మొక్కల పెంపకం, స్వయంభు లింగేశ్వర ఆలయ అభివృద్ధి, వితంతువులకు వస్త్రదానం, రోడ్ల ఇరువైపులా షెల్టర్లు, సౌకర్యానికి ఎంతో కృషి చేశారని అన్నారు. రచయితలు తెప్పల కృష్ణమూర్తి, గుమ్మడి సాంబమూర్తి, సోషల్ వర్కర్ హనుమంతు మురళీధొర, లండ జోగారావు కూడా సంతాపాన్ని తెలిపారు.

భారీగా చోరీ సొత్తు స్వాధీనం

- 26 కేసుల్లో ఇద్దరు అరెస్టు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో నమోదైన బంగారు ఆభరణాలు దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులను కేసు దర్యాప్తులో భాగంగా విచారించగా వారి వద్ద నుంచి సుమారు రూ.49.25 లక్షలు విలువైన చోరీసొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో చోరీ సొత్తును శనివారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26 కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. 574 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6.80 లక్షలు విలువ కలిగిన వెండి (6.8 కిలోల) ఆభరణాలు, రూ.2.43 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు తన సిబ్బందితో కలిసి పార్వతీశంపేట కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారని అన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కుప్పిలి రాజు, కుప్పిలి నర్సింగరావుని పట్టుకుని విచారించారని అన్నారు. జిల్లాలో మొత్తం 26 దొంగతనాలు చేసినట్లు, ఇవే కాకుండా గతంలోనూ పలు నేరాలు విజయనగరం జిల్లాల పరిధిలో చేసినట్లు, దొంగిలించిన సొత్తును ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో ఎవరికైనా అమ్ముదామని వెలుతున్నట్లు చెప్పారు. పట్టుబడినట్లు వారి వద్ద నుంచి రూ.58,48,000 విలువ కలిగిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు


చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

స్వాధీనం చేసుకున్నారు. సదరు 26 కేసుల్లో 15 కేసుల్లో ముద్దాయిలు, శ్రీకాకుళం జిల్లాలో ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌తో పాటు కలిపి 11 కేసుల్లో నేరాలతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. నేరస్తులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కొంతమంది వ్యక్తులతో కలిసి గ్రూప్‌గా ఏర్పడి, దొంగతనాలు చేయాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో ముందుగా నేరం చేయు ప్రాంతానికి దగ్గరగా చేరుకుని, అక్కడ ఒంటరిగా అనువుగా ఉన్న ఇళ్లు, తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలను పగులగొట్టి లోపాలకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో ఉన్న బంగారు, వెండి వస్తువులు, డబ్బులను దొంగిలించారని అన్నారు. నిద్రిస్తున్న మహిళలు మెడలో బంగారు ఆభరణాలు తెంపుకుని పారిపోవడం, ఒక్కోసారి బీరువాను ఎత్తుకుని పొలాల్లోకి తీసుకుని వెళ్లి తాళాలు పగలు గొట్టి అందులోని వస్తువులను దొంగతనం చేయడం వంటి నేరాలు వీరు చేస్తూ వచ్చారు. కేసు చేదించడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్లు వి.సూర్యచంద్రమౌళి, సత్యన్నారాయణ, ఎస్ఐలు ఎస్.బాలరాజు, కె.మధు సూదనరావు, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, విజయ్ కుమార్, హరికృష్ణ, రాజు, రాధాకృష్ణ, శ్యామ్ సుందర్, సుధీర్‌లను అభినందించారు.

గల్లంతైన హెచ్‌ఎం మృతి

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటకు చెందిన మారుపు నాగేశ్వరరావు (55) ప్రధానోపాధ్యాయులు వంశధార నదిలో శుక్రవారం గల్లంతైన శనివారం మృత దేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు గోపాలపెంటలోనే ప్రధానోపా ధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రువారం ఉదయం వాకింగ్ చేసిన తర్వాత నదిలో స్నానానికి దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయాడు. భార్య రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన పోలీసులు, ఎస్ఆర్‌డి బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం వనితమండలం వద్ద నది ఒడ్డున మృతదేమం ఒడ్డుకు చేరుకుంది. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సుధీర్, సునీల్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హెచ్ఎం మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకుంది. ఉపాధ్యాయులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


నాగేశ్వరరావు (ఫైల్)


పట్టుకున్న కలపతో అధికారులు

కలప పట్టివేత

శ్రీకాకుళం సిటీ: ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు ఎచ్చెర్ల మం డలం కేశవరావుపేట పరిధి కింతలిమిల్లు సమీపంలోని అమరావతి వేబ్రిడ్జి వద్ద విజిలెన్స్, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు శనివారం నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమంగా కలప తరలిస్తున్న లారీలు స్వాధీనం చేసు కున్నారు. 39.970 టన్నులు బరువు గల రూ.1,16,058 విలువ గల అకేషి కలపను అధికారులు గుర్తించారు. అటవీ అధికారులు కలప, 4 వాహనాలను స్వాధీనం చేసుకుని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై వాల్టా ఫారెస్ట్ చట్టం 1967, ఫారెస్ట్ ప్రొడ్యూస్ ట్రాన్సిట్ రూల్స్ 1970 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ రామా రావు, కానిస్టేబుల్ ఈశ్వరరావు, కన్నబాబు, లక్ష్మి నారాయణ, అటవీ శాఖ అధికారి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు క్వార్టర్స్ శిథిలం

- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- విపరీతంగా విషసర్పాలు
- భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రం 16వ నంబర్ జాతీయ రహదారికి అనుకుని ఊరు మధ్య లో ఉన్న జె.ఆర్. పురం పోలీసు క్వార్టర్స్ పూర్తిగా శిథిలమై చాలా ఏళ్లవు తుంది. పోలీసులకు క్వార్టర్స్ లేకపోవ డంతో కొంత మంది అద్దె ఇళ్లలో నివాసముంటే, మరికొంత మంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆసమస్య పక్కన పెడితే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలు సంచరించడంతో పాటు క్రిమి కీటకాలు, దోమల బెడద కూడా


పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఎక్కువైందని క్వార్టర్స్ చుట్టుపక్కల ఉన్న వాళ్లు ఆందోళన చెందుతున్నారు. పలు రకాలైన విషసర్పాలు క్వార్టర్స్ చుట్టుపక్కల ఇళ్లలోనికి రావడంతో ప్రతిరోజు కొడు తున్నారు. గతంలో క్వార్టర్స్‌కి అనుకుని ఉన్న ఇంటిలోనికి పాము ప్రవేశించి ఒక మహిళకు కాటు వేయడంతో మృతి చెందారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విషసర్పాల నుంచి భయ పడుతున్నారు. విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడంతో విపరీతంగా దోమలు విజృంభించి దోమ కాటుకు చికెన్ గున్యా, డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని విలీన పంచాయతీ కాలనీల్లో మురుగు కాలువలు ఏర్పాటు, లొతట్టు ప్రాంతాల్లో నీరు పారేందుకు నగర కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. విలీన పంచాయతీల్లోని పలు కాలనీల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బృందం పలు సమస్యలను గుర్తించింది. ఇటీవల జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా అధికారులు, కూటమి నాయకులు ఘనంగా ఉత్సవాలు జరుపుకొని ఒకటి, రెండు కాలనీలను ఎంచుకొని స్వచ్ఛభారత్ పేరుతో మురుగు, చెత్తరహిత పట్టణంగా శ్రీకాకుళాన్ని సుందరంగా తీర్చిదిద్దామని మీడియా ద్వారా తెలియజేశారని, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఒక అడుగు ముందుకేసి పట్టణంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తులు ఎత్తు కేవలం 24 మీటర్లు అనుమతి ఉందని, 30 మీటర్లకు పెంచి అపార్ట్మెంట్స్ సుందరంగా కనిపించడానికి సహకరిస్తామని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం చాలా సంతోషమని, ఈ సుందర భవనాల్లో నివసించే ధనవంతులు వాడే మురుగునీరు ఎక్కడికి విడిచిపెడతారని ప్రశ్నిస్తున్నామన్నారు. గడిచిన 30 ఏళ్ల నుంచి పట్టణానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని, గతంలో నెదర్లాండ్ దేశ సహకారంతో అప్పుడున్న పాలకవర్గం పట్టణ మురుగుని అంతా బయటకు పంపడానికి భూగర్భ డ్రైనేజీ కొరకు ప్రతిపాదనలు తయారు చేశారని, అది ఏ కారణాల రీత్యా నేటికీ అమలు కాలేదన్నారు. సుమారు 4లక్షల పైచిలుకు జనాభా నివసిస్తున్నా పట్టణం నేడు మురికి కూపంగా తయారైందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీలు పూర్తిగా నీటిలో మునిగి ఉంటున్నాయన్నారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, విషజ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు బారిన నగర ప్రజలు ఇబ్బందులు


కాలనీలో పరిస్థితి పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలకు అవసరమైన శాశ్వత భూగర్భ డ్రైనేజీ కొరకు తక్షణమే నిధులు రాబట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిపి సమస్యలపై ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ బృందంలో టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, సభ్యులు ఎం.గోవర్ధనరావు, సీనియర్ నాయకులు కె.సూరయ్య, బి.సింహాచలం, ఎల్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రెండో రోజు నిరాహారదీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జెఎసి నేతత్వాన సంబంధిత కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు నిరాహారదీక్షలు శనివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఈ దీక్షలు ఈ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంబంధిత సంఘ నాయకులు మాట్లాడుతూ పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. అలానే కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ఇంతవరకూ ఒక్కో ఉద్యోగికీ రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ ఎరియర్స్ రావాల్సి ఉందన్నారు. కానీ, ఇంతవరకూ ఆ ఊసేలేదన్నారు. ప్రతి పిఆర్‌సిలోనూ తమకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ లైన్ మ్యాన్‌లను గ్రేడ్-2లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో పెన్షన్ ట్రస్టును బలోపేతం చేయాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ విరమణ తరువాత కనీసం రూ.ఐదు లక్షల పెన్షన్ బెనిఫిట్స్ వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇపిఎఫ్, జిపిఎఫ్ వెంటనే అమలు చేయాలని విన్నవించారు. విద్యుత్ ఉద్యోగులకూ, పెన్షనర్లకూ వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆర్థిక భద్రత, ఆరోగ్య భద్రత అన్నవి లేవని ఆవేదన చెందారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వి.గోపాలరావు, జి.రామార్జున్‌కుమార్, పి.వి.అప్పలనాయుడు, బి.వి.గురునాథరావు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకం కార్డులు జారీ చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పథకం కార్డులు సత్వరమే జారీ చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయ ఆవరణలో వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పథకం కార్డులు జారీ చేయడంలో 104 తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సంబంధిత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పెడితే దానిని చూసి కార్డును జారీ చేయుటలో జాప్యం చేస్తూ కాల్ సెంటర్‌కు ఎప్పుడు ఫోన్ చేసినా, ఈమెయిల్ పంపినా కాల్‌ను లైన్‌లో ఉంచి సమాచారం ఇచ్చే సంబంధిత వ్యక్తులు లేరని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. గతంలో జారీ చేసిన కార్డులు కూడా ట్రస్ట్ పేరు మార్చి ఇవ్వడంలో జాప్యం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలలోని పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీరంనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు మండలాలకు చెందిన ఇంజినీరింగ్ సహాయకులతో శనివారం సమీక్షించారు. అనుమతి పొందిన పనులు మండల ఇంజినీర్ల పర్యవేక్షణలో ఎంతవరకు పనిచేశారని సహాయకులను అడిగి తెలుసుకున్నారు. పనులకు ఎక్కడా అంతరాయం కలగనియవద్దని, సమయంలోపే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి అలసత్వం వహిస్తే చర్యలకు వెనుకాడబోమని తెలిపారు. సమావేశంలో డిఇ సుధకరరావు, జెఇ అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి


సమీక్షిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన గ్రేవ్ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు చేయాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో కేసుల దర్యాప్తు, పురోగతి, ముద్దాయిల అరెస్టు తదితర అంశాలపై శనివారం నేర సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల భద్రత, పిల్లల రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ఈవ్ టీజింగ్, హరాస్మెంట్, పోక్సో కేసులు, బాల్య వివాహాలు, సామాజిక మాధ్యమాలు నేరాలు తదితర అంశాలపై నారీశక్తి కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పెడింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేసి ఛార్జీషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలన్నారు. నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తూ... పూర్తిస్థాయిలో అక్రమ రవాణాను అరికట్టాలని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో దొరికిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సులు సీజ్ చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ పాత నేరస్థులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని ఆదేశించారు. అధికారులు గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామంలో సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగానే అవగాహన కల్పించాలన్నారు. తప్పుడు నంబరు ప్లేట్లు ఉన్న వాహనాలను గుర్తించాలన్నారు. సమీక్షలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి వివేకానంద, లక్ష్మణరావు, ఎఒ గోపీనాథ్, ఎస్‌బి సిఐ ఇమ్మానుయేల్‌రాజు పాల్గొన్నారు.

ఉల్లాసంగా అక్షరాంధ్ర

కోటబొమ్మాళి: మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో శనివారం అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణను ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. శిక్షణ పొందినవారు ఎన్‌ఆర్‌ఆర్‌జిఎస్, ఎస్‌హెచ్‌జిలతో ఉన్న నిరక్ష్యరాస్యులకు చదవడం, రాయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, చైల్డ్‌కేర్ ఎడ్యూకేషన్ అంశాలపై భోధిస్తారని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి బోధించేందకు సంబంధిత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పి.సూర్యనారాయణ, ఎన్‌ఆర్‌జిఎస్ ఎపిఒ జి.హరిప్రసాద్, టిసి రాంబాబు, రిసోర్స్‌పర్సన్ ఎన్.లక్ష్మణరావు, ఎం.బోగిరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపల్ బాలిక హైస్కూల్‌లో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన ఉల్లాస్ కార్యక్రమంలో అక్షరాంధ్రపై విద్యావాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా టిఎంసి బోర భాస్కరరావు, సిఒ సంతోష్‌కుమార్, కంబాల చంద్రశేఖరం, కె.సాయిరాం పాల్గొన్నారు.

ఆమదాలవలస: నిరక్షరాస్యత నిర్మూలనతోనే మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ పరిధిలో గల 1,200 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించి, వారిని చదవడం, రాయడం నేర్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించారు. మహిళలకు అవసరమైన బోధనా పద్ధతులపై మాస్టర్ ట్రైనర్ బి.రమేష్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా టిఎంసి ఎస్.వి.రత్నం, మెప్మా సిఒలు నాగమణి, వినోద్, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపిడిఒ సాహిని వాసుదేవరావు అధ్యక్షతన రెండో విడత అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వాలంటీర్లుకు మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సహాయ పథక సంచాలకులు జి.హరిత, మండల ప్రత్యేకాధికారి ఆర్.రఘునాథ్, డిప్యూటీ ఎంపిడిఒ సింహాచలం, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం రమణమూర్తి, సిసి శ్యామలరావు, వెలుగు సిబ్బంది, ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ రవి



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

శక్తివంతమైన కుటుంబం ఉండాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్తి పరివారు వినియోగించుకోవాలని దంత వైద్యులు డాక్టర్ సలాన శరత్ కుమార్ మాజీ సర్పంచ్ బి.లలితకుమారి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సంయుక్తంగా శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు ఆరోగ్యపరంగా అనేక సమస్యలను ఎదుర్కుంటున్నారని చెప్పారు. మహిళలు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి వాసుదేవరావు, డాక్టర్ బోసిబాబు, ఎఎన్ఎం పడాల శర్వాణి, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : దేశ వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శిబిరాలు, 8వ జాతీయ పోషణ మాషోత్సవ ప్రారంభం, ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింది ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని, ఆరోగ్యవంతమైన మహిళలు, శక్తి వంతమైన కుటుంబం ఉండాలని ఉద్దేశంతో 'స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, పొన్నాడ రాజారావు ,పరపటి చిన్నయ్య రెడ్డి పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే, సర్పంచ్

రణస్థలం రూరల్: మహిళల ఆరోగ్యమే కుటుంబ సంతోషానికి మూలమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రావాడ పిహెచ్‌సి వైద్య బందంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను స్థానిక సర్పంచ్ రజనితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చౌదరి అవినాష్, లంక శ్యాం, పిన్నింటి భానోజీనాయుడు, మన్నె వరాహమూర్తి, కృష్ణానందం, పాశపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం మలకాంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 57 మందికి రక్తహీనత, బిపి, షుగర్ వంటి పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడ శ్రీను, వైద్యాధికారి డా.నవీన్, ఎంఎల్‌హెచ్‌పి సూర్యకాంతం, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో అంత్యోదయ కార్డు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని ముకుందాపురానికి చెందిన మన్మథరావు 2017లో వలస కూలిగా జీవనం సాగిస్తుండేవాడు. అయితే అప్పటికే అతనికి ఉన్న అంత్యోదయ కార్డు ఉంది. ఈ అంత్యోదయ కార్డును బడగం పంచాయతీ గనియాపేటకు చెందిన గరుడాచలం తులసీదాస్ అనే వ్యక్తి కుటుంబ యజమానిగా ఆ కార్డులో అక్రమంగా యాడ్ చేయించుకున్నారు. 2018 నుంచి 35 కేజీల బియ్యాన్ని పొందుతున్నాడు. అయితే ఒరిజినల్ కార్డు యజమాని తన కార్డు ఇంటిలో పోయిందని, మరలా కార్డు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్తాడు. నీరు పేరుతో కార్డు ఉందని, మీ కార్డు ఇవ్వడం అవ్వడని అధికారులు చెప్పారు. అనంతరం పరిశీలిస్తే మన్మథరావు పేరుతో ఉన్న కార్డులో తులసీదాస్ పేరుతో కార్డు వార్డులో యాడ్ ఉన్నందని, దీని ఆధారాలతో సహా తహశీల్దార్ కార్యాలయంలో శనివారం డిటి శంకరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై టిడిని వివరణ కోరగా, ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, గ్రామ స్థయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ సముదాయ సమావేశంలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న కె.వి.ఎం సత్యనారాయణను శనివారం ఘనంగా సన్మానించారు. ఈయన స్థానిక పిల్లలవలస మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ సముదాయం బస్వా గొల్లవాడు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ప్రైవేట్ యూరియా దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎఒ బి.నరసింహమూర్తి శనివారం తనిఖీ చేశారు. గడిచిన వారం రోజులుగా 1110 బస్తాలు యూరియా వ్యవసాయ సహాయకుల కూపనులు మేరకు కొర్లాం, పాలవలస, కర్తలిపాలెం, బారువ, దామోదరపురం గ్రామాల రైతులకు సరఫరా జరిగిన విధానాన్ని పరిశీలించారు. అయితే ఆన్‌లైన్ సేల్స్ నెల్‌వర్క్ పనిచేస్తున్నప్పుడు వేగవంతంగా చేసి ఎప్పటికప్పుడు నివేదికలు చేయాలని ఆదేశించారు. అలాగే రైతులను ఎటువంటి ఆలస్యం చేయకుండా త్వరగా బస్తాలు ఇచ్చి పంపించాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు ప్రదీప్, గ్రామ రెవెన్యూ అధికారి తేజ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'శ్రీజ్ఞాన జ్యోతి'లో ఎస్‌ఎల్‌సి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భాస్కరరావు

నరసన్నపేట : స్థానిక మారతీ నగర్ టులో శ్రీజ్ఞాన జ్యోతి స్కూల్‌లో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాందోళన బయటకు తీయడానికి ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తల్లిదండ్రుల నుండి హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులతో తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. కార్యక్రమంలో ష్రజ్ఞాన జ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలు పంపిణీ

కవిటి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, యుపి పాఠశాలలకు గణితం, సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన బోధనోపకరణాలను ఎంఇఒ-1 ధనుంజయ మజ్జి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

లావేరు : మండలంలోని పెదరావుపల్లి పంచాయతీ ఆరంగిపేట గ్రామానికి చెందిన విశాఖ డైరీ డైరెక్టర్ ఆరంగి రమణబాబును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పరామర్శించారు. రమణబాబు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కిరణ్ కుమార్ పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో వైసిపి మండల కన్వీనర్ దన్నాన రాజనాయుడు, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి నాయకులు బొంతు సూర్యనారాయణ, పెద్ది చిరంజీవి, ఆరంగి అప్పారావు, లక్ష్మణరావు, రామారావు, ఆనంద్ తదితరులున్నారు.

తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సోంపేట : తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉపాధ్యాయులు, మెరైన్ పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సముద్ర తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ ఆఫ్ డే కార్యక్రమాన్ని శనివారం బారువ తీరంలో చేపట్టారు. అటవీశాఖ కాశిబుగ్గ రేంజ్, రేంజర్ ఎ.మురళీకృష్ణనాయుడు, బీట్ ఆఫీసర్ సంతోష్, కె.వి.పాలెం బీట్ ఆఫీసర్ రవికుమార్, వజ్రకొత్తూరు బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, మెరైన్ పోలీస్ సిఐ రమేష్, సిబ్బంది, సముద్ర తాబేలు సంరక్షణ సభ్యులు, ఉపాధ్యాయులు మార్పు చక్రధర్, బి.బాబూరావు మత్స్యకారులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలను వాటి వల్ల భూమికి కలిగే నష్టాన్ని ట్రీ ఫౌండేషన్ శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్ కె సోమేశ్వరరావు విద్యార్థులకు తెలియజేశారు.

సంతోష్‌కుమార్ సాహుకి డాక్టరేట్


డాక్టరేట్‌తో సంతోష్‌కుమార్ సాహు

ఇచ్ఛాపురం: ఫార్మసీ హెల్త్ కేర్ సర్వీస్‌లో ఉత్తమ సేవలు అందించినందుకు ఒడిశా రాష్ట్ర కార్మిక ఉద్యోగశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు చేతుల మీదుగా ఇచ్చారానికి చెందిన సంతోష్ కుమార్ సాహు శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ఒడిశా రాజధాని భుబనేశ్వర్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ సాక్షరత మిషన్ నిర్వహించిన వరల్డ్ వైడ్ అవార్డ్స్-25లో ఫార్మసీలో హెల్త్ కేర్ సర్వీసెస్ విభాగంలో ఆయన సేవలకు ఉత్తమ సామాజిక కార్యకర్తగా డాక్టరేట్ ప్రదానం చేశారు. రెండు దశాబ్ధాలుగా వృత్తిపరమైన ప్రయాణంలో ఒక అర్థవంతమైన మైలురాయిగా భావిస్తున్నానని సంతోష్‌కుమార్ సాహు తెలిపారు.

పుస్తకాలు వితరణ

శ్రీకాకుళం సిటీ: పుస్తకాలు వితరణ మంచి అలవాటని నగర కమిషనర్ బివి.డి. ప్రసాదరావు అన్నారు. డొనేట్ ఎ బుక్ కార్యక్రమాన్ని స్థానిక గాంధీ పార్క్‌లోని మున్సిపల్ గ్రంథాలయంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇళ్లలో ఉపయోగం తీరిన తర్వాత అల్మారాలో మిగిలిపోయే పోటీ పరీక్షల పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, కథలు, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు మున్సిపల్ లైబ్రరీలకు దానం చేస్తే, వాటిని మరికొందరు చదివి విజ్ఞానం పెంపొందించుకుంటారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక ప్రగతి అవసరం

శ్రీకాకుళం సిటీ: ఉద్యాన వన పంటలు సాగులో సాంకేతిక ప్రగతి అవసరమని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో శనివారం డిజిటల్ గ్రీన్ ట్రెస్టు మైక్రోసాఫ్టు సంస్థ పార్మర్ చాట్ మొబైల్ అప్లికేషన్ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ మాట్లాడుతూ వ్యవసాయంలో మార్పులు అవసరంగా చెప్పారు. ప్రభుత్వం డిజిటల్ గ్రీన్, మైక్రోసాఫ్టు సంస్థలతో కలిసి కృత్రిమ మేదతో సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. యామాన్యపు ఖర్చులు తగ్గటం సైతం అవసరంగా వివరించారు. కార్యక్రమంలో ఉద్దానవనశాఖ అధికారులు సిహెచ్.చంద్ర శేఖర్‌రావు, డిజటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు జి.శ్రీకాంత్, డి,శేషపాణి పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


రణస్థలం : మాట్లాడుతున్న హెచ్‌ఎం శివశంకర్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మనుగడ కోసం హిందీ భాష నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు వై.కాంతారావు అన్నారు. మండలంలోని పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పక్షోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా మాట్లాడుతున్న భాషలో హిందీ రెండవదని, భారతదేశంలో ఎక్కడైనా మనుగడ సాగించాలంటే జాతీయ భాషను నేర్చుకోవాలని తెలిపారు. జాతీయ అధికార భాషాపాధ్యాయ సహాయకులు ఎన్.విష్ణుమూర్తి మాట్లాడుతూ రాజేంద్ర సింగ్ హిందీ భాషను భారతదేశం అంతటా వ్యాప్తి చేయడంలో గాంధీజీ సహాయంతో ఎనలేని కృషి చేశారని అన్నారు. అనంతరం గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.పాపారావు పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేయడంపై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ దున్న కవిత రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. హిందీ పక్షోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుంట కోదండరావు, కె.మాధవరావు, బి.అన్నపూర్ణ, ఎం.హరనాథ్, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్, టి.శివాజీ పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ వారోత్సవంలో భాగంగా శనివారం హిందీ దివస్‌ను ప్రధానోపాధ్యాయులు ఎస్.శివశంకర్ ఆధ్వర్యంలో హిందీ ఉపాధ్యాయులు పి.శ్రీదేవి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ హిందీ అనేది మన జాతీయ భాష, 55 శాతం పైగా ప్రజలు మాట్లాడుతున్న భాషని ఈ భాషను విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హిందీ భాషలో నైపుణ్యం సంపాదించుకుంటే దేశంలో చాలా ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. హిందీ ఉపాధ్యాయులు శ్రీదేవి మాట్లాడుతూ హిందీ అనేది ప్రజలను కలిపే భాషని,హిందీని అందరు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.రహీం, టి.సురేష్, కె.ఖగేశ్వరరావు, బి.గౌరీ హరినాథ్, జి.చిన్నికృష్ణం నాయుడు, వై.ప్రమీల, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో వ్యాధులు


నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

పొగాకు వాడకం వలన కలిగే అనార్థాలను వివరిస్తూ లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వద్దు.. జీవితం ముద్దు, సిగరెట్ చిన్నది.. నష్టం పెద్దది, స్మోక్ కాదు.. స్మైల్ అవ్వు వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.. గ్రామ గ్రంథాలయం వద్ద జరిగిన సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వలన ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, కంటి వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అనేక వ్యాధులకు గురువుతున్నారని అన్నారు. సిగరెట్, చుట్ట కాల్చడం వలన వారి చుట్టూ ఉన్నవారు కూడా వ్యాధుల బారిన పడతారని హెచ్‌ఎం రువ్వ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. పొగాకు వాడకం వలన కలిగే నష్టాలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక గ్రామస్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

న్యాయం చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

రైల్వే రన్నింగ్ రూమ్‌ల్లో పనిచేసే కార్మికులకు పనికి తగ్గ వేతనాలు చెల్లించి తమకు న్యాయం చేయాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పలాస రైల్వే రన్నింగ్ రూమ్ ప్రాంతంలో శనివారం రైల్వే ఫుడ్ అండ్ క్లీనింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రోజుకు 8 గంటల చొప్పున పని చేయాల్సి ఉండగా, 16 గంటల పాటు తమతో పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రశ్నించే కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తమ సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, మన్మథరావు, రమేష్, ప్రకాశ్, లక్ష్మి, జానకి, అనురాధ, రవణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వికలాంగులకు అవయవాల నమూనా పరీక్షలు


వికలాంగురాలిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పలాస : వికలాంగులకు అండగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవాల నమూన పరీక్షలు నిర్వహించామని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పలాస నియోజకవర్గం పరిధిలో ఆల్ మెక్కో, జిల్లా సమగ్ర శిక్షణ ఆధ్వర్యాన వికలాంగులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి సంబంధించిన ఉపకరణాలు అందిస్తామని చెప్పారు. సోమవారం టెక్కలి, మంగళవారం పాతపట్నం, బుధవారం శ్రీకాకుళం, గురువారం నరసన్నపేట, శుక్రవారం ఆమదాలవలస, శనివారం ఎచ్చెర్ల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 50 మంది వికలాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ చెరుకుపల్లి సత్యం, ప్రధానోపాధ్యాయుడు చిన్నంనాయుడు, సమీకృత విద్యావనరుల ఉపాధ్యాయులు రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి వీల్‌చైర్ అందజేత

ఆమదాలవలస : పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎస్. వాసుదేవరావు ఆధ్వర్యంలో వికలాంగుడైన ఫకీర్ సాహెబ్ పేటకు చెందిన బి.ప్రవీణ్ కుమార్‌కు సత్యసాయి సేవా సంస్థల తరపున వీల్ చైర్‌ను జిల్లా మెడికల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.తాతయ్యలు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ మునగవలస రవీంద్రబాబు, స్టేట్ విద్యా జ్యోతి ఇన్‌ఛార్జి ఎస్.గురుప్రసాద్, యూత్ కో-ఆర్డినేటర్ బి.దామోదర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న ప్రసన్న

చెరువులకు జియో ట్యాగింగ్

బూర్జ : చెరువు గర్భాలు ఆక్రమణలకు గురికాకుండా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నామని ఛీఫ్ ప్లానింగ్ అధికారి వివిఎస్ఎల్ ప్రసన్న అన్నారు. శనివారం మండలంలో పలు గ్రామాల్లో ఉన్న చెరువు గర్భాలను పరిశీలించారు. మండలంలో చిన్నతరహా వనరుల చెరువులకు, గొట్టపు బావులు జియోట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు. మండలంలో 64 గ్రామాల్లో 305 పైగా చెరువులు, గొట్టపు బావులు, నేలబావులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 150 నేలబావులు, గొట్టపు బావులకు జియో ట్యాగింగ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటికి కూడా త్వరగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈమెతో పాటు గణాంకాల అధికారి అప్పారావు, ఎఎస్ఒ అచ్యుతరావు, విఆర్‌ఒ రమాబాయి, సిబ్బంది ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

నందిగాం : మండలంలోని కాపుతెంబూరు పంచాయతీ లట్టిగాంలోని సాయి ఉషోదయ స్కూల్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు శక్తియాప్ ఇన్‌ఛార్జి గిరిధర్ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉండాలని, శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండే అవసరమైనప్పుడు వినియోగించు కోవాలని సూచించారు. హెచ్‌ఎం ఎస్.కూర్మారావుపాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న తహశీల్దార బాలకృష్ణ

కెజిబివి తనిఖీ

కొత్తూరు : మండలంలోని వసప కెజిబివిని తహశీల్దార్ కె.బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో 248 కేజీల బియ్యం అదనంగా నిల్వ ఉన్నట్టు గుర్తించారు. స్టోర్‌రూమ్‌లో 56 ప్యాకెట్లు 25 కేజీల చొప్పున 1400 కేజీల బియ్యం పట్టుబడ్డాయి. రికార్డుల ప్రకారం అదనంగా 46 ప్యాకెట్లు, 25 కేజీల చొప్పున 1150 కేజీల బియ్యం పట్టుబడింది. విచారణ చేపట్టి సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసికి నివేదిక అందజేస్తామని తెలిపారు. కెజిబివి ప్రత్యేకాధికారిపై గతంలో రేషన్ బియ్యం బయటకు తరలిపోతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.


పోటీలు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

శాంతినికేతన్‌లో వ్యాసరచన పోటీలు

ఇచ్ఛాపురం : స్థానిక శాంతినికేతిన విద్యా సంస్థల్లో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యాన శనివారం రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో 8 నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, సురేఖ, పద్మజ, గోపాలరావు పాల్గొన్నారు.

నెరివంకలో 'పొలం పిలుస్తోంది'

కవిటి: మండలంలోని బొరివంకలో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలు పొలాల్లో పాముపొడ తెగులు, అగ్గి తెగులు వ్యవసాయ అధికారి పిరియా శ్రీదేవి గుర్తించారు. అగ్గితెగులు నివారణకు రైతులు ఎకరానికి 120 గ్రాములు ట్రైసైక్లోజెల్ మందును నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని, పాముపొడ తెగులు నివారణకు హెక్సాకోనాజోల్ మందు ఎకరాకు 400 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.